సాక్షి విశాఖపట్నం

గురువారం । 23 । నవంబర్ । 2023



కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు సూచనలిస్తున్న కోచ్ వీవీఎస్ లక్ష్మణ్



నేడే టీ-20

సిద్ధమైన వైఎస్సార్ ఏసీఏ- వీడీసీఏ స్టేడియం

IIలో

బతుకు నావకు భరోసా

- ప్రమాదం జరిగిన 72 గంటల్లోనే పరిహారం
- రికార్డు సమయంలో ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఒక్కో బోటు యజమానికి 80 శాతం పరిహారం
- రూ.7.11 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- బోటుపై ఆధారపడిన వారికీ ఆపన్న హస్తం
- వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఒక్కొక్కరికీ రూ.10 వేల సాయం
- 480 మందికి అందజేసేలా ఏర్పాట్లు
- నేడు మంత్రి సీదిరి చేతుల మీదుగా పరిహారం అందజేత



ఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

సాక్షి, విశాఖపట్నం: హుద్‌హుద్ విపత్తులో నష్టాల వలలో చిక్కుకున్న మత్స్యకారులకు పరిహారం అందించేందుకు టీడీపీ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. వందలసార్లు వినతులిచ్చి.. ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే కానీ ఆదుకునేందుకు టీడీపీ ప్రభుత్వానికి మనసు రాలేదు. కానీ ప్రమాదవశాత్తూ జరిగిన ప్రమాదంలో రోడ్డున పడ్డ మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 72 గంటల సమయం పట్టలేదు. ఘటన జరిగిన వెంటనే దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం.. నష్టంలో 80 శాతం పరిహారం అందజేస్తామని వెంటనే ప్రకటించారు. చెప్పారంటే చేస్తారన్నది మరోసారి నిరూపించుకుంటూ.. బాధిత మత్స్యకారులకు గురువారం రూ.7.11 కోట్లు పరిహారం అందజేయనున్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో బోట్లు అగ్నికి ఆహుతై.. సర్వం కోల్పోయి మత్స్యకారులు రోడ్డున పడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ఎక్కడా లేని విధంగా ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. 72 గంటలు గడవకముందే పంపిణీ చేయాల్సిన సొమ్మును కలెక్టర్ ఖాతాకు జమ చేశారు. ఈ ప్రమాదంలో మొత్తం 30 బోట్లు పూర్తిగా దగ్ధమవ్వగా.. 18 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటితో పాటు ఒక మత్స్యకారుడి వల కూడా ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయింది. విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం బాధిత మత్స్యకారుల జాబితాను సేకరించిన కలెక్టర్ డా.మల్లికార్జున నేతృత్వంలో జిల్లా యంత్రాంగం నివేదికను ప్రభుత్వానికి పంపించింది. నివేదిక పంపించిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం నుంచి పరిహారం సొమ్ము జిల్లాకు చేరుకుంది. నష్టంలో 80 శాతం అంటే.. మొత్తం రూ.7,11,76,000 అందించనున్నారు. ఈ మేరకు పూర్తిగా దెబ్బతిన్న 30 బోట్లకు రూ.7,21,50,000, అందులో ఉన్న వలలకు రూ.84.50 లక్షలు చొప్పున మొత్తం రూ.8,06,00,000 నష్టపోయినట్లు అంచనా వేశారు. ఇందులో 80 శాతం అంటే రూ.6,44,80,000ని 30 మంది బోటు యజమానులకు అందించనున్నారు. అదే విధంగా పాక్షికంగా దెబ్బతిన్న 18 బోట్లు, ఒక వలకు రూ.71.50 లక్షలు, బోట్లలో ఉన్న వలలకు రూ.12.20 లక్షలు చొప్పున మొత్తం రూ.83.70 లక్షలు నష్టం వాటిల్లినట్లు గణించారు. ఇందులో 80 శాతం రూ.66.96 లక్షలు అందించనున్నారు.

విచారణ వేగవంతం

అగ్ని ప్రమాద ఘటనపై దర్యాప్తు బృందం విచారణ వేగవంతం చేసింది. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు.. బుధవారం కూడా మరికొంత మందిని విచారించారు. మొత్తం 30 మందిని విచారించిన పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టుకున్నారు. అదే విధంగా ప్రమాదం జరిగిన సమయంలో హార్బర్‌లో మందు సేవిస్తున్న వారి వివరాలను కూడా సేకరించారు. ఆ సమయంలో ఎక్కడ ఉన్నారు.. వీరికి, ప్రమాదానికి ఏమైనా సంబంధం ఉందా అనే అంశాలపైనా విచారణ చేపడుతున్నారు. మరోవైపు.. ప్రమాదం జరగడానికి 15 నిమిషాల ముందు, ప్రమాదం జరిగిన తర్వాత 10 నిమిషాల సమయంలో ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో ఫోన్ నంబర్ల లొకేషన్ల ఆధారంగా ఎవరెవరున్నారనే వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం ఉదయం క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించింది. మరోవైపు అగ్నిమాపక శాఖ అధికారులు కూడా వివరాలు సేకరిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజ్‌లో సేకరించిన వివరాల మేరకు రూమ్ నం.7కి ఎదురుగా ఉన్న బోటులో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందనీ జిల్లా దర్యాప్తు బృందం చెబుతోంది. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నివేదికను అందించేందుకు విచారణ వేగవంతం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ భరోసా ఇవ్వాలని..



ఊహకందని ఘోర ప్రమాదంలో వందలాది మంది మత్స్యకారులు రోడ్డున పడ్డారు. ప్రమాద ఘటనలో నష్టపోయిన ప్రతి ఒక్కరి కన్నీళ్లు తుడిచేలా భరోసా ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ మేరకు బోట్లు యజమానులతో పాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారికీ సహాయం అందజేయాలని నిర్ణయించాం. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా గురువారం బాధిత మత్స్యకారులకు పరిహారాన్ని చెక్కుల రూపంలో అందజేస్తాం. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాల్ని దర్యాప్తు బృందం సేకరిస్తోంది. త్వరలోనే ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు అందనున్నాయి.

– డా.మల్లికార్జున, కలెక్టర్

బోటుపై ఆధారపడిన వారికీ..

కేవలం బోటు యజమానులే కాకుండా.. ఆ బోటుపై ఆధారపడే వారి గురించీ ప్రభుత్వం ఆలోచన చేసింది. సముద్రంలోకి వేటకు వెళ్తేనే ఆ పూటగడిచే పరిస్థితి ఉన్న హమాలీలు, చిరు వ్యాపారులు ఈ ప్రమాదం వల్ల ఉపాధి కోల్పోయారు. సాధారణంగా ఏ ప్రభుత్వమూ వీరి గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బోటుపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఒక్కో బోటుపై సుమారు 10 మంది చొప్పున ఆధారపడి జీవనం సాగిస్తుంటారనీ.. ఈ లెక్కన మొత్తం 48 బోట్లపై 480 మంది హమాలీలు, చిరు వ్యాపారులు ఆధారపడుతున్నారని అధికారులు నివేదిక సిద్ధం చేశారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పంపిణీ చేయనున్నారు. ఇలా ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం పరిహారం అందించడం ఇదే ప్రప్రథమమని మత్స్యకారులు హర్షం **వ్యక్తం చేస్తున్నారు.**

నిర్లక్ష్యంగా దూసుకొచ్చి.. లారీని ఢీకొట్టి..

- పిల్లలను ప్రమాదంలోకి నెట్టేసిన ఆటోడ్రైవర్ అతివేగం
- నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు
- బాధితులకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్ పరామర్శ





సీసీ ఫుటేజ్: లారీ సమీపంలోకి దూసుకొచ్చిన ఆటో, ప్రమాద స్థలిలో చెల్లాచెదురుగా విద్యార్థులు



తీవ్ర గాయాలపాలైన హాసిని ప్రియను పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్



తలపై తీవ్రగాయంతో హాసిని ప్రియ

సీతమ్మధార : వేగంగా దూసుకొచ్చిన ఆటోడ్రైవర్ లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో 8 మంది విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం, మురళీనగర్, 104 ఏరియా ప్రాంతాలకు చెందిన హాసిని ప్రియ (15), వాణి జయ రమ్య (13), డి.లక్ష్య (8), జి.గాయత్రి (13), మరో నలుగురు విద్యార్థులు నగరంలోని బేతనీ స్కూల్‌లో చదువుతున్నారు. వీరు అదే ప్రాంతానికి చెందిన రాజు అనే వ్యక్తి ఆటోలో మూడేళ్లుగా స్కూల్‌కు వస్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం ఆటోలో స్కూల్‌కు బయలుదేరారు. అయితే అప్పటికే ఆలస్యం కావడం... వీరిని పాఠశాల వద్ద దించేసి, మరికొంత మంది విద్యార్థులను వేరే స్కూల్‌కు తీసుకెళ్లాల్సి ఉండడంతో డ్రైవర్ రాజు ఆటోను వేగంగా నడుపుతున్నాడు. ఈ క్రమంలో వీరి ఆటో సంగం శరత్ థియేటర్ జంక్షన్ సమీపానికి వచ్చేసరికి, రైల్వే స్టేషన్ రోడ్డులో కాంప్లెక్స్ వైపు ఓ లారీ వస్తోంది. ఫ్లైఓవర్ సమీపానికి వచ్చేసరికి లారీ కనిపించడంతో ఆటోలోని హాసిని ప్రియ గమనించి... లారీ వస్తోందని గట్టిగా అరిచింది. అయినప్పటికీ ఆ లారీని దాటి ముందుకు వెళ్లిపోవాలని నిర్లక్ష్యంతో డ్రైవర్ రాజు ముందుకు దూసుకురాగా... అప్పటికే లారీ వచ్చేయడంతో దాన్ని ఢీకొట్టి ఆటో బోల్తాపడింది. ఒక్కసారిగా అందులోని విద్యార్థులంతా చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోవడంతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన నలుగురికి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో నుజ్జునుజ్జయ్యింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఓ ప్రైవేట్ హోటల్ మేనేజర్ వెంకటరావు, స్థానిక యువకుడు శివ స్పందించి తీవ్ర గాయాలైన హాసిని ప్రియ, వాణి జయ రమ్య, డి.లక్ష్య, జి.గాయత్రిని కారులో తీసుకెళ్లి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో హాసిని ప్రియ తలకు తీవ్ర గాయమవడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేసి పర్యవేక్షణలో వుంచారు. మరో నలుగురు విద్యార్థులకు రైల్వే ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జి చేశారు. ఆటో డ్రైవర్ రాజును కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాద స్థలాన్ని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు పరిశీలించి ఆటో, లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆ అమ్మాయి మాట వినుంటే...

అంకుల్.. లారీ వస్తోంది చూడండి.. అని గట్టిగా అరిచిన హాసిని ప్రియ మాటను డ్రైవర్ రాజు విని వుంటే పరిస్థితి వేరేలా వుండేదని పలువురు అంటున్నారు. లారీని గుర్తించిన వెంటనే ఆటో వేగాన్ని నియంత్రించి... తర్వాత వెళ్లి వుంటే పిల్లలంతా క్షేమంగా స్కూల్‌కు చేరుకునే వారు. తోటి విద్యార్థులతో చక్కగా చదువుకుని సాయంత్రం ఇళ్లకు చేరుకుని తల్లిదండ్రులతో ఆనందంగా గడిపేవారు. ఆ అమ్మాయి మాట వినకుండా నిర్లక్ష్యంగా ఆటోను నడిపి 8 మంది విద్యార్థుల భవిష్యత్‌ను డ్రైవర్ రాజు ప్రమాదంలోకి నెట్టేశాడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాధిత విద్యార్థులకు పరామర్శ

ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థులను సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లి వైఎస్సార్ సీపీ రీజినల్ కో - ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పరామర్శించారు. పిల్లల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని, అవసరమైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఆయనతోపాటు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, డీసీపీ – 1 శ్రీనివాసరావు, గొండు సీతారామ్, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.ఆనందకుమార్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డీఈవో చంద్రకళ, రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ రాజారత్నం పరామర్శించారు.

త్రుటిలో తప్పిన ముప్పు

పీఎం పాలెం: స్కూలు పిల్లలను తీసుకెళ్లిన ఆటో బోల్తాపడడంతో మధురవాడ ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందారు. స్థానిక భాష్యం స్కూల్‌లో చదువుకుంటున్న పిల్లలను తీసుకుని బుధవారం ఉదయం ఆటో నగరంపాలెం రోడ్డులో వస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు పిల్లలకు, డ్రైవర్‌కు స్వల్ప గాయలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై బోల్తాపడిన ఆటోను లేవదీసి, పిల్లలకు సపర్యలు చేశారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ఫోకస్

- రేపు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం
- స్కూల్ బస్సులు, ఆటోలపై స్పెషల్ డ్రైవ్
- నేటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

విశాఖ విద్య: విద్యార్థుల భద్రతపై జిల్లా యంత్రాంగం ఫోకస్ పెట్టింది. నగరంలో బుధవారం రెండు చోట్ల జరిగిన ప్రమాదాలతో అప్రమత్తమైన అధికారులు, మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24న జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించనున్నారు. విద్య, రవాణా, పోలీసు, జీవీఎంసీ అధికారులు సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. జిల్లాలోని ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ల వారిని కూడా సమావేశంలో భాగస్వాములను చేస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటోల్లో సరైన నిబంధనలు పాటించని కారణంగానే ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అధికారులు గుర్తించారు.

సమగ్ర వివరాలు సేకరణ : ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులను బస్సుల ద్వారా తీసుకెళ్లేందుకు మాత్రమే రవాణా శాఖ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. కానీ ఆటోల ద్వారా కూడా ఎక్కువగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నందున వీటిపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు నిర్ణయించారు. జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లకు ఎంతమంది వాహనాల ద్వారా వస్తున్నారు..? బస్సుల ద్వారా వచ్చే వారు ఎంతమంది?, ఆటోల ద్వారా ఎంతమంది వస్తున్నారనే పక్కా లెక్క సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులను స్కూళ్లకు తీసుకొచ్చే బస్సు లేదా ఆటోలకు సంబంధించిన వివరాలు, వాటిని నడిపే వారి వివరాలు స్కూళ్ల యాజమాన్యాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నారు.

నేటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ మల్లికార్జున స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో రవాణాశాఖ అప్రమత్తమైంది. విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్లే వాహనాలను గురువారం నుంచి తనిఖీ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో మూడు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు మూడు రోజుల పాటు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నాయి.

బడుగుల ఆత్మబంధువు సీఎం జగన్



మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్

దాబాగార్డెన్స్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు విజ్ఞానవంతులవుతుంటే చంద్రబాబు చూసి ఓర్వలేకపోతున్నారని బీసీ సంక్షేమ, పౌరసంబంధాల శాఖ మంత్రి సీహెచ్ వేణుగోపాలకృష్ణ ఆరోపించారు. సామాజిక సాధికారతకు అర్థం చెప్పింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు దృష్టిలో సామాజిక సాధికారత అంటే తన సామాజిక వర్గానికే మేలు చేయడమని ఎద్దేవా చేశారు. అతని దృష్టిలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఎవరూ కాదన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లు వేసుకుని చంద్రబాబు తన సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తే.. నా బీసీ.. నా ఎస్సీ.. నా ఎస్టీ.. నా మైనార్టీ అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందలం ఎక్కించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తే.. తోలు తీస్తానని మత్స్యకారులను చులకన చేస్తూ మాట్లాడారని.. ఒకానొక సందర్భంలో ఎస్సీల్లో పుట్టాలా అని ఎస్సీలను కూడా హేళన చేశారన్నారు. నాయీ బ్రాహ్మణులు ఆలయాల్లో తమకు ప్రాధాన్యమివ్వాలని కోరితే.. ఎవడురా మిమ్మల్ని ఇక్కడకు రానించాడంటూ చంద్రబాబు చులకన చేసిన మాట్లాడారని గుర్తు చేశారు. సీఎం జగన్ మత్స్యకారుల కష్టాలను తన కష్టాలను భావిస్తారని, ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం జరిగితే ఏ ఒక్క బోటు యజమాని నష్టపోకుండా 80 శాతం మేర నష్టపరిహారం ప్రకటించారన్నారు. నాయీ బ్రాహ్మణులకు వృత్తి పరంగా ఆలయాల్లో స్థానం కల్పించి ఔదార్యం చాటుకున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఎదుగుదలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారికి అండగా ఉంటున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఆత్మబంధువుగా, ఆత్మరక్షకుడిగా సీఎం జగన్ నిలిచారన్నారు. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో కులగణనకు నాంది పలికారన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సామాజిక న్యాయం కోసం ఎదురుచూస్తూనే ఉన్నామని.. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత ఆ కల నెరవేరిందన్నారు. రూ.2.38లక్షల కోట్లతో సంక్షేమ ఫలాలు అందించారన్నారు. రాష్ట్రంలో 31 లక్షల కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చారన్నారు. అందుకే సామాజిక సాధికార యాత్రలో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి చేసిన మంచిని చెబుతున్నామన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెంటే ఉన్నారన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.ఎ.రెహ్మాన్, చింతలపూడి వెంకట్రామయ్య, సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

జనజాతర



జగదాంబ జంక్షన్‌లో మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, వాసుపల్లి, గురువులు, ముత్తంశెట్టి



టౌన్‌కొత్తరోడ్డులో సభకు హాజరైన జనసందోహం

- విశాఖ దక్షిణలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలో బుధవారం వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. నాలుగున్నరేళ్లగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరిస్తూ ముందుకు సాగుతున్న మంత్రులు, ప్రజా ప్రతినిధులను పార్టీ జెండాలు పట్టుకుని అనుసరించారు. మేలు చేసిన ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ.. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. తీన్మార్ డప్పులు.. డీజేలు.. డప్పు వాయిద్యాలు.. రేలా రేలారే జానపద నృత్యాలు.. పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ బస్సు యాత్ర సాగింది.

సామాజిక సాధికార బస్సు యాత్ర సాగిందిలా..

● ఉదయం 11.30 గంటలకు డైమండ్ పార్క్‌కు వందలాది బైక్‌లపై పార్టీ కార్యకర్తలు చేరుకున్నారు. ● ఉదయం 12 గంటలకు సమీపంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం జరిగింది. ● మధ్యాహ్నం 2.05 గంటలకు డైమండ్ పార్క్ వద్ద పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పలువురు మంత్రులు జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. ● మధ్యాహ్నం 2.15 గంటలకు దొండపర్తి జంక్షన్ చేరుకున్న యాత్ర, అక్కడి నుంచి రైల్వే న్యూకాలనీ సర్కిల్, రైల్వే స్టేషన్ రోడ్డు, చావులమదుం జంక్షన్ మీదుగా మనోరమ థియేటర్ వద్దకు చేరుకుంది. ● 2.35 గంటలకు మనోరమ థియేటర్ వద్ద ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పార్టీ జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు వాకా శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో వైవీ సుబ్బారెడ్డి, పలువురు మంత్రులు సందర్శించారు. అంబులెన్స్, గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం కల్పించాలని వైవీ సుబ్బారెడ్డి దృష్టికి వైద్యులు తీసుకొచ్చారు. ● అక్కడి నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు రామకృష్ణ రైతు మార్కెట్, దుర్గాలమ్మ గుడి జంక్షన్, పోలీస్ బ్యారెక్స్, సూర్యాబాగ్, చిత్రాలయ మీదుగా జగదాంబ జంక్షన్‌కు యాత్ర చేరుకుంది.



సభనుద్దేశించి మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

● మధ్యాహ్నం 3.10 గంటలకు జగదాంబ జంక్షన్‌లోని మహానేత విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● మధ్యాహ్నం 3.30 గంటలకు జగదాంబ జంక్షన్ నుంచి లేపాక్షి జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు మీదుగా సభా ప్రాంగణం టౌన్ కొత్తరోడ్డుకు చేరుకుంది. ● మధ్యాహ్నం 3.35 గంటలకు సభ ప్రారంభమై.. 5.30 గంటల వరకు సాగింది. ● సాంస్కృతిక విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్ నేతృత్వంలో సభా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, సీహెచ్ వేణుగోపాలకృష్ణ, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, తూర్పు నాయకుడు అక్కరమాని వెంకటరావు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ఏ రెహ్మాన్, చింతలపూడి వెంకట్రామయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, దక్షిణ ఇన్‌చార్జ్ వీసం రామకృష్ణ, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, నాయకులు సీతంరాజు సుధాకర్, ద్రోణంరాజు శ్రీ వత్సవ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరక్టర్లు, కార్పొరేటర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మత్స్యకారులంటే చులకన



ఐదేళ్లు టీడీపీలో ఉన్నాను. వైఎస్సార్ సీపీలో కూడా దాదాపుగా ఐదేళ్లున్నాను. తెలుగుదేశం పార్టీకి, వైఎస్సార్ సీపీకి సముద్రమంత వ్యత్యాసం కనిపించింది. చంద్రబాబుకు మత్స్యకారులంటే చులకన. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకారులంటే ప్రాణం. మత్స్యకారులకు కష్టం వచ్చిందంటే తనకే కష్టం వచ్చినట్టు భావిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం ఆలోచించి వారి శ్రేయస్సుకు కృషి చేస్తున్నారు. మత్స్యకార సామాజిక వర్గం నుంచి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన నన్ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గణేషన్న అని ఆప్యాయంగా పలకరిస్తారు. నాపై పాలు పోసి 3వ సారి ఎన్నికకు సిద్ధం కావాలని చెప్పడం ఎంతో సంతోషాన్నిచ్చింది. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాను. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకుంటాను.

– వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్యే

మైనార్టీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



చంద్రబాబు 600 హామీలిచ్చి.. 10 శాతం కూడా అమలు చేయలేదు. దొడ్డిదారిలో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారు. 73వ ఏటలో ఆట మొదలైందని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబు మళ్లీ జైలుకు వెళ్లడం ఖాయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు శతశాతం పూర్తి చేసి ప్రజల ముందుకు వస్తున్నారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గంలోని ముస్లింలందరూ మద్దతు పలకాలి.

– ఖాదర్‌భాషా, వక్ఫ్‌బోర్డు చైర్మన్

రేపటి నుంచి 'అయ్యప్ప మహా సంగమం'

- ఏయూ మైదానంలో 26 వరకు ప్రత్యేక పూజలు
- వివరాలు వెల్లడించిన పూజా కోర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య



మాట్లాడుతున్న పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణయ్య

సీతంపేట: పూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ పర్యవేక్షణలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు ఏయూ గ్రౌండ్‌లో అయ్యప్ప మహా సంగమం కార్యక్రమం నిర్వహించనున్నట్టు పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణయ్య తెలిపారు. శంకర మఠంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24న స్థల శుద్ధి, గోపూజ, 25వ తేదీ ఉదయం 5.30 గంటలకు గణపతి హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు విలక్ పూజా మహోత్సవం, 26వ తేదీ తెల్లవారుజాము వరకు కేరళ నుంచి వచ్చిన మేల్ శాంతిలు, తంత్రిలు మలయాలంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మహిళలు, వృద్ధులు, వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. పూర్ణపుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్ చైర్మన్ పైలా ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ శంకరమఠంలో రోజూ జరుగుతున్న అన్నదాన కార్యక్రమం 25, 26 తేదీలలో జరగదని, ఏయూ గ్రౌండ్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు హరిప్రసాద్, ట్రస్ట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

కోర్టు ధిక్కరణకు పాల్పడితే చర్యలు

పీఎం పాలెం/మధురవాడ: భూవివాదానికి సంబంధించి జారీ చేసిన తాఖీదును నిర్లక్ష్యం చేసిన వ్యక్తిపై కోర్టు ధిక్కరణ కింద పరిగణించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం పరిధిలోని సర్వే నంబరు 153//1లో 5 ఎకరాల 28 సెంట్లు, 153/3లో 4 ఎకరాల 18 సెంట్లు, 154/1లో 30 సెంట్లు ఉంది. ఈ భూములకు సంబంధించి గ్రంధి కామరాజు అనే వ్యక్తి రివిజన్ పిటిషన్ నంబరు 15/23పై జాయింట్ కలెక్టర్, విశాఖ కోర్టు ముందు హాజరు కావాలని ఈ ఏడాది జూలై 1, 17, సెప్టెంబర్ 16, డిసెంబర్ 4న హాజరు కావాలని నోటీసులు జారీ చేయగా గైర్హాజరు అయ్యారు. దీనిని తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్న జేసీ ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, లేని ఎడల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కుర్రాళ్లకు భలే చాన్స్

- నేడు భారత్-ఆస్ట్రేలియా టీ-20 మ్యాచ్
- సిద్ధమైన వైఎస్సార్ స్టేడియం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం



స్టేడియంను సిద్ధం చేస్తున్న సిబ్బంది

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో క్రికెట్ సందడి నెలకొంది. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా గురువారం రాత్రి 7 గంటలకు భారత్, ఆస్ట్రేలియా మొదటి టీ-20 మ్యాచ్ ప్రారంభం కానుంది. మ్యాచ్ కోసం ఇప్పటికే విశాఖ చేరుకున్న ఇరు జట్లు స్టేడియంలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాయి. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు ఇప్పటికే హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్ విక్రయించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ ఓటమి తర్వాత క్రికెట్ అభిమానులు చాలా డీలా పడ్డారు. ఆ ఓటమిని ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారు. కీలక పోరు ముగిసిన తర్వాత జరుగుతున్న టీ-20 మ్యాచ్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత జట్టు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినివ్వడంతో.. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో యువ క్రికెటర్లకు ఈ సిరీస్ గొప్ప సువర్ణావకాశం. ఐపీఎల్, ఇటీవల ఐర్లాండ్ టూర్‌లో విజృంభించిన కుర్రాళ్లు.. విశాఖ వేదికగా సత్తా చాటి జాతీయ జట్టులో బెర్త్ పదిలం చేసుకోవచ్చు. జోరుమీదున్న ఆస్ట్రేలియా జట్టును ఢీకొట్టి శుభారంభం అందించాలని కోరుకుంటున్నారు.

వరల్డ్ కప్ క్రికెట్ టైటిల్ సాధించి ఊపు మీదున్న ఆస్ట్రేలియా నాలుగు రోజుల వ్యవధిలోనే విశాఖ వేదికగా టీ20 సిరీస్‌కి సిద్ధమైంది. భారత్ తరఫున ప్రధాన ఆటగాళ్లంతా విశ్రాంతి తీసుకుంటుండగా.. ఆస్ట్రేలియా తరఫున కొందరు ఆటగాళ్లు తమ ఇళ్లకు చేరారు. ఫైనల్‌లో సత్తాచాటిన ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఇప్పటికే విశాఖకు చేరుకుని నెట్స్‌లో శ్రమించారు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు అంతర్జాతీయ అరంగేట్రం చేసే కుర్రాళ్లు ఆస్ట్రేలియా తరఫున బరిలోకి దిగనుండగా.. ఆసియా కప్, ఐర్లాండ్ టీ-20 సిరీస్ మినహా పూర్తిస్థాయిలో మేజర్ టోర్నీలు ఆడిన అనుభవం లేని యువ భారత్ జట్టు వారితో ఢీ కొట్టనుంది. భారత్‌కు నాయకత్వం వహిస్తున్న సూర్యకుమార్‌కు, కోచ్‌గా వి.వి.ఎస్ లక్ష్మణ్‌కు ఇదే తొలి మ్యాచ్. ఈ మ్యాచ్‌లో భారత్ కుర్రాళ్లు శుభారంభం చేసి ఆధిక్యాన్ని ప్రదర్శించాలని కోరుకుంటున్నారు.

పరిస్థితికి తగ్గట్టుగా రాణిస్తే విజయమే

- విశాఖ పిచ్ పరిశీలించాను, బాగుంది
- భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్

విశాఖ స్పోర్ట్స్: పరిస్థితులకు తగ్గట్టుగా రాణిస్తే విజయం సాధ్యమేనని భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నారు. టీ-20 సిరీస్‌లో శుభారంభం చేసేందుకు ఎలాంటి ప్రణాళిక చేశారనే విషయాలను బుధవారం ఆయన మీడియాకు వివరించారు. వరల్డ్ కప్ ఫైనల్ ఓటమితో చాలా డిస్సాయింట్ అయ్యామని, అయితే టోర్నీ మొత్తం చాలా కష్టపడ్డామన్నారు. ఫైనల్‌కు చేరడంలో ప్రతీ ఆటగాడు సమష్టిగా జట్టుకు తోడ్పడినట్లు చెప్పారు. విశాఖలో పిచ్‌ను పరిశీలించానని, చాలా మంచి పిచ్ అన్నారు. నాయకుడిగా జట్టును ముందుండి నడిపించడం సవాలేనని, దీన్ని ఒక బాధ్యతగా తీసుకుంటానన్నారు. నూతనోత్తేజంతో ముందుకు సాగుతామన్నారు.

బ్లాక్‌లో క్రికెట్ మ్యాచ్ టికెట్ల విక్రయం



స్వాధీనం చేసుకున్న టికెట్లు, సెల్‌ఫోన్స్

బీచ్ రోడ్డు: పీఎం పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఇండియా-ఆస్ట్రేలియా టీ20 క్రికెట్ టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్న వారిని టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పీఎం పాలెం స్టేడియం వద్ద క్రికెట్ టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు సీపీ ఆదేశాలతో దాడులు చేశారు. 51 టికెట్లు, 4 సెల్ ఫోన్లు సాధీనం చేసుకున్నారు. అలాగే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, పీఎం పాలెం పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

టీ-20కి పటిష్ట భద్రత

- నిర్ణీత సమాయానికి వీక్షకులు స్టేడియానికి చేరుకోవాలి
- నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేయాలి
- డీసీపీ-1 కె.శ్రీనివాసరావు సూచన



మ్యాప్‌లు ప్రదర్శిస్తున్న డీసీపీ-1 శ్రీనివాసరావు

అల్లిపురం: ఇండియా, ఆస్ట్రేలియా టీ-20 క్రికెట్ మ్యాచ్‌కు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు డీసీపీ-1 కె.శ్రీనివాసరావు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు 2,000 వేల మంది ఏఆర్, సివిల్ అధికారులు, సిబ్బందితో స్టేడియం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేడియం వద్ద బారికేట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ గేటు వద్ద ఏసీపీ స్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. స్టేడియం వద్ద మూడంచెల భద్రతతో పలు సెక్టార్లుగా విభజించి స్టేడియం లోపల, బయట, చుట్టుపక్కల మేడలు, అపార్ట్‌మెంట్స్ పై భద్రత చర్యలు చేపట్టామన్నారు. మ్యాచ్ జరిగే సమయంలో ఎటువంటి పిక్ పాకెటింగ్, ఇతర దొంగతనాలు జరగకుండా క్రైం సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. టికెట్‌పై సీరియల్ నంబర్, సీట్ నంబర్, గేట్ నంబర్ ఆధారంగా ప్రేక్షకులు వారి వారి స్థానాలకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టేడియంలోకి చేరుకోవాలన్నారు. బయట నుంచి ఎటువంటి తినుబండారాలు స్టేడియంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. క్రికెట్ మ్యాచ్ చూసేందుకు 28 వేల మంది విచ్చేస్తున్న సందర్భంగా.. మ్యాచ్‌తో సంబంధం లేని వాహనచోదకులు ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు. మ్యాచ్‌కు వచ్చే వారు నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల మరమ్మతులకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు అందిస్తున్న దేవస్థానం ఏఈవో నరసింహరాజు, సిబ్బంది

సింహాచలం: పంచ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఏఈవో నరసింహరాజు తెలిపారు. సింహాచలం కొండ దిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో బుధవారం దరఖాస్తులు అందించే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. దరఖాస్తుదారుడి పేరు, ఆధార్, మొబైల్ నంబర్లు నమోదు చేసుకుని, దరఖాస్తుపై క్రమ సంఖ్య వేసి అందజేశారు. తొలి రోజు 94 మంది నివాసితులు దరఖాస్తులు తీసుకున్నారని ఏఈవో తెలిపారు. దరఖాస్తుతో సంబంధిత ధ్రువ పత్రాలు జత చేసి, ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. అలాగే www.simhachalamdevasthanam permissionforrepairs.com వెబ్‌సైట్ నుంచి కూడా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సింహాచలంలోని శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఉన్న కేంద్రంలోనే అందజేయాలని తెలిపారు.

టీ-20 మ్యాచ్‌లో డిప్యూటీ మేయర్‌కు బాధ్యతలు



జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య గురువారం జరిగే టీ-20 మ్యాచ్‌లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు ఆహార, పరిశుభ్రత కమిటీ బాధ్యతలు అప్పగించారు. ఈ మేర కు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి బుధవారం వెల్లడించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన పలు అంతర్జాతీయ మ్యాచ్‌లు విజయవంతం చేయడంలో డిప్యూటీ మేయర్ తనదైన పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోమారు అతనికి బాధ్యతలు అప్పగించారు.

నిబంధనలు పాటించని ఆటోలపై చర్యలు

- ఆటోలో ఐదుగురికి మించి స్కూల్ పిల్లలను తీసుకెళ్లొద్దు
- డీసీపీ – 1 శ్రీనివాసరావు

అల్లిపురం: స్కూల్ పిల్లలను ఆటోల్లో పరిమితికి మించి తీసుకెళ్తే చర్యలు తప్పవని నగర శాంతిభద్రతల డీసీపీ – 1 కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను స్కూల్‌కు పంపించే విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను సమయానికి ముందుగా తయారు చేసి స్కూల్‌కు పంపించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు కూడా నిబంధనలు పాటించాలన్నారు. పాటించని వారిపై రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వారి వివరాలను పోలీస్ వాట్సాప్ నంబరు 94933 36633కు పంపితే పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

28 ఆటోలపై కేసులు



నగరంలో ఆటోలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం సూచించారు. ఆటోలో ఆరుగురు విద్యార్థులను మాత్రమే తీసుకెళ్లాలన్నారు. ఈ క్రమంలో బుధవారం తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని 28 ఆటోలపై కేసులు నమోదు చేశారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లే విషయంలో తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్కూల్ సమయం కంటే ముందుగా సిద్ధం చేసి పంపించాలని తెలిపారు. ఇంటి వద్దే ఆలస్యం చేయడం వల్ల ఆటో డ్రైవర్ వేగంగా వెళ్లే అవకాశముందన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

క్రైం డీసీపీ బదిలీ

బీచ్‌రోడ్డు: విశాఖ సిటీ క్రైం డీసీపీ జి. నాగన్నకు బదిలీ అయింది. ఆయన్ను హెడ్ ఆఫీసుకు బదిలీ చేస్తూ బుధవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

గురునాథరావు ఆశయాలు కొనసాగించాలి

22వ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి




గురునాథరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి

సీతమ్మధార: దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు ఆశయాలు కొనసాగించాలని, ఆ శక్తి సామర్థ్యాలు ఆయన తనయుడు మంత్రి అమర్‌నాథ్‌కు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. గురునాథరావు 22వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఈ ప్రాంతానికి గురునాథరావు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఉత్తరాంధ్రలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఆయన చేసిన మంచిని చెప్పుకుంటున్నారన్నారు. గురునాథరావు ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశీస్సులతో మంత్రి అమర్‌నాథ్ కొనసాగిస్తారని చెప్పారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, సీతంరాజు సుధాకర్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు జి.వి.రవిరెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఆరుబయలు రంగస్థలం ప్రారంభం రేపు


- హాజరు కానున్న సినీనటుడు అక్కినేని నాగార్జున



ఆధునికీకరించిన ఆరుబయలు రంగస్థలం

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆరుబయలు రంగస్థలం (ఎస్కిన్ స్క్వేర్) ఆధునికీకరణ పూర్తి చేసుకుని ఈ నెల 24న ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. సినీనటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా నిరాదరణకు గురై శిథిలావస్థకు చేరుకున్న ఈ ప్రాంగణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పథకం స్ఫూర్తితో ఆధునికీకరించారు. నెక్కంటి సీ ఫుడ్స్ అందించిన సీఎస్ఆర్ నిధులతో బెంచీలు, ఫ్లోరింగ్, కోరమాండల్ పెయింట్స్ అందించిన సీఎస్ఆర్ నిధులతో ప్రాంగణానికి వర్ణాలు అద్ది సుందరంగా తీర్చిదిద్దారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అక్కినేని అమల, అక్కినేని అఖిల్, నాగేశ్వరరావు కుమార్తె సుశీల పాల్గొననున్నారు.

కార్పొరేటర్ 'కాకి' అక్రమాలపై విచారణ



తుంగ్లాంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి నుంచి వివరాలు సేకరిస్తున్న ట్రైనీ కలెక్టర్ మాధురి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు టీడీపీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అక్రమాలపై బుధవారం ట్రైనీ కలెక్టర్ మాధురి విచారణ చేపట్టారు. కార్పొరేటర్ నిర్మించుకున్న భవనానికి రహదారి కోసం ఏకంగా అక్కడున్న పాఠశాలనే కూల్చేశారని స్పందనలో కలెక్టర్‌కు, జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంతో కలిసి ఆమె విచారణ జరిపారు. అక్కడున్న సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ భవనం ప్రభుత్వానిదని, దీనిలో వాటర్ ప్లాంట్ పెట్టి నీటి వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయని మాధురి తెలిపారు. తొలగించిన పాఠశాల స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు జెడ్సీ తెలిపారు. ఇక్కడ ప్రైవేట్‌గా నిర్వహిస్తున్న కల్యాణ మండపానికి అధికారులు తాళాలు వేశారు. కార్పొరేటర్ అక్రమాలకు పాల్పడినట్టు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఈఈ ప్రసాదరావు, అధికారి శ్రీలక్ష్మి, పలువురు రెవెన్యూ, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సామాజిక సాధికారత

- 25న సబ్బవరంలో బస్సు యాత్ర
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక సాధికారత సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలో ఈ నెల 25న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను బుధవారం ఉత్తరాంధ్ర సాధికార బస్సుయాత్ర పరిశీలకుడు లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. చోడవరం-సబ్బవరం రోడ్డులో దుర్గాలమ్మ ఆలయం సమీపంలో బహిరంగ సభ నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు, తదితర అంశాలపై పోలీసులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద ఎత్తున మేలు చేకూర్చారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మాడుగుల, అనకాపల్లి, యలమంచిలిలో నిర్వహించిన సాధికార యాత్రలు విజయవంతమయ్యాయన్నారు. ఈ నెల 25న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో బస్సుయాత్ర, బైక్ ర్యాలీ వేపగుంటలో ప్రారంభమవుతుందన్నారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సాయంత్రం డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రంగనాథంతో కలిసి బహిరంగ సభతో పాటు ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను అదీప్‌రాజ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లి అనురాధ, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, కాపుశెట్టి శేషుబాబు పాల్గొన్నారు.

ఏయూ విజయాలు ప్రశంసనీయం

- నైపుణ్య కేంద్రంగా ప్రతి సాంకేతిక విద్యా సంస్థ
- మిజోరం గవర్నర్ హరిబాబు



ఏయూలోని ఆ-హబ్‌ని పరిశీలిస్తున్న గవర్నర్ హరిబాబు

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇటీవల సాధించిన పలు విజయాలు తనకు అమితమైన సంతోషాన్ని కలిగిస్తున్నాయని ఏయూ పూర్వ విద్యార్థి, పూర్వ ఆచార్యుడు, మిజోరాం రాష్ట్ర గవర్నర్ కె.హరిబాబు అన్నారు. బుధవారం ఆయన ఏయూలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఏయూ ఒడిలో రాజకీయ ఓనమాలు నేర్చుకుని, జగదాంబ వీధుల్లో ఉద్యమ శ్వాసను పీల్చుకున్నానన్నారు. నాక్‌లో ఏయూ డబుల్ ప్లస్ సాధించడం పట్ల ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని అభినందించారు. నూతన విద్యా విధానం 2020ని ఏయూలో పూర్తిస్థాయిలో అమలుపై హర్షం వ్యక్తం చేశారు. యువత ఆలోచనలకు రూపం కల్పించే వేదికగా ఆ హబ్ నిలుస్తోందన్నారు. ప్రతి సాంకేతిక విద్యా సంస్థ ఒక నైపుణ్య శిక్షణ కేంద్రంగా నిలుస్తూ స్టార్టప్ వ్యవస్థను కలిగి ఉండాలని సూచించారు. ఆ హబ్‌ను సందర్శించి, వివరాలు తెలుసుకుని, యువతతో మాట్లాడారు. ఏయూ నుంచి యూనికార్న్‌లు ఆవిర్భవించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి స్వయంగా హరిబాబుకు ఏయూ ఇంక్యుబేషన్ స్టార్టప్ కేంద్ర ఆ-హబ్ వివరాలు తెలిపారు. రాజ్యసభ పూర్వ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణ రావు, ఎస్.కె.భట్టి, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు పాల్గొన్నారు.